# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-10-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ అమరావతిలో 250 కోట్ల రూపాయలతో టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

❖ విజయనగరానికి చరిత్రలో సమున్నత స్థానం ఉందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

❖ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

❖ విజయనగరంలో శ్రీ పైడితల్లమ్మ ఉత్సవాలకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు.

❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నైరుతి బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడనుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

విద్యల నగరంగా విజయనగరానికి చరిత్రలో సమున్నత స్థానం ఉందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. విజయనగరం ఉత్సవాలు ఈ రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆ వివరాలను మా విజయనగరం ఆకాశవాణి ప్రతినిధి కె.రామకృష్ణ తెలియజేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని అన్ని జిల్లాల బీసీ సంక్షేమ శాఖాధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఈ రోజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17న వాల్మీకి జయంతి సందర్భంగా అన్ని జిల్లాల్లోనూ జయంత్యోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజున అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి

కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హాజరుకానున్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లుగా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

==========================

అమరావతిలో 250 కోట్ల రూపాయలతో టెక్నాలజీ సెంటర్ ను త్వరలో ఏర్పాటు చేయనున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, వంద పడకల ఇ.ఎస్.ఐ ఆసుపత్రిని పత్తిపాడులో ఏర్పాటు చేయనున్నామని అన్నారు. అమరావతిలో కూడా 300 కన్నా ఎక్కువ పడకలతో మరో ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కాగా, రాష్ట్రాభివృద్ధికి, కేంద్ర నిధులు తీసుకురావటానికి ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పార్లమెంటు సభ్యులందరూ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కేంద్ర మంత్రి వివరించారు.

==========================

విజయనగరంలో రేపు, ఎల్లుండి జరిగే శ్రీ పైడితల్లమ్మ తొలేళ్ళు, సిరిమానోత్సవానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తెలిపారు. ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సిరిమానోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు సుమారు 2 వేల మంది పోలీసులతో బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. మొత్తం బందోబస్తును కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షించేందుకు అదనపు ఎస్పీని నియమించామని తెలిపారు. అదే విధంగా శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి దేవాలయం ఎదురుగా తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతం, సిరిమాను తీసుకొని వచ్చే మార్గం, ఇతర ముఖ్య కూడళ్ళలో 80 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

==========================

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను సైతం అమలు చేస్తున్నామని అన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ద్వారా బీసీల ఆత్మగౌరవాన్ని పెంచామని మంత్రి తెలిపారు.

==========================

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపైన శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో భవానీ మాలధారులు ఈ రోజు నుండి దీక్ష విరమిస్తున్నారు. భవానీ మాల ధారణ చేపట్టిన స్వాములు ఇంద్రకీలాద్రికి పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. దాంతో భవానీ భక్తులకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిసనర్ శ్రీరామ్ సత్యనారాయణ, కనకదుర్గమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విరామం

==========================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రేపటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

===========================

రేపటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తిరుపతి జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా స్థాయి సిబ్బందితో తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

===========================

అధికారంలోకి వచ్చిన 4 నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పట్టభద్రుల ఎన్నికల ఓటు నమోదు అవగాహన కార్యక్రమంలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రేపటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా “పల్లె పండుగ” కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలలో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

===========================

గంజాయిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సామూహిక అత్యాచార బాధితులను ఈ రోజు ఆమె పరామర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.... గంజాయి వాడకం వల్ల యువత పెడదారి పడుతోందని అన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టడం పైన ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. గంజాయిని నిరోధించడం ద్వారా నేరాలను నియంత్రించగలమని అన్నారు.

===========================

విజయనగరంలోని స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో పుష్ప ప్రదర్శనను రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ రోజు ప్రారంభించారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో వివిధ పుష్పాలు అలరించాయి. ఈ ప్రదర్శనను స్పీకర్‌తో పాటు మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు తిలకించారు.

===========================

ఇంద్రకీలాద్రి పైన వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు ఎలమంచిలి సత్యనారాయణ తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఘాట్ రోడ్డు వద్ద 2 శాశ్వత మార్గాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. విజయవాడలో ఈ రోజు ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దసరా ఉత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

===========================
===========================